సాక్షి యాదాద్రి భువనగిరి

శనివారం । 28 । జనవరి । 2023



క్రీడాకారులకు మేధాశక్తి అధికం

క్రీడాకారులకు మేధాశక్తి అధికంగా ఉంటుందని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. - 8లో



యాదాద్రి ఆర్టీసీ బస్టాండ్ సిద్ధం

యాదాద్రిలో ఆధ్యాత్మిక హంగులతో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్‌ను ఫిబ్రవరి 1న ప్రారంభించనున్నారు. - 10లో

గరిష్టం/కనిష్టం 31°/17°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

మూసీ పారగా.. గోదావరి ముద్దాడగా

ధాన్యపు సిరులు నిండుగా

ఏటేటా పెరుగుతున్న వరి సాగు

- ఆరేళ్ల క్రితం 62,480 ఎకరాలు.. ఈ వానాకాలం 3.19 లక్షల ఎకరాలకు పైనే..
- సమృద్ధిగా సాగు నీటి వనరులు
- వరి వైపు మొగ్గు చూపుతున్న రైతులు

రాష్ట్ర స్టాటిస్టికల్ రిపోర్ట్‌లో వెల్లడి



భువనగిరి సమీపంలో పూర్తయిన యాసంగి వరి నాట్లు

తీవ్ర క్షామ పీడిత ప్రాంతంగా ఉన్న గుండాల మండలంలో 2020–21 వానాకాలంలో 7,699 ఎకరాలు, యాసంగిలో 11,897 ఎకరాల్లో వరి సాగైంది. 2021–22 వానాకాలం 15,386 ఎకరాలు, యాసంగిలో 10,716 ఎకరాల్లో సాగు చేశారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలతో మండలంలోని చెరువులను నింపుతుండడంతో భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయి. దీంతో వేలాది ఎకరాల్లో వరి సాగు విస్తీర్ణం పెరుగుతోంది.

సాక్షి, యాదాద్రి : ఒకప్పుడు కరువుతో అల్లాడిన ప్రాంతంలో నేడు ధాన్యపు సిరులు కురుస్తున్నాయి. నీటి వసతి లేక, కనీస వర్షపాతం నమోదు కాక బీడుగా మారిన వేలాది ఎకరాల భూములు పచ్చని పంటలతో కళకళలాడుతున్నాయి. మూసీ కాల్వల ఆధునీకరణ, గోదావరి జలాల రాక, సాధారణానికి మించి నమోదవుతున్న వర్షపాతంతో వరిసాగు గణనీయంగా పెరిగింది. ప్రభుత్వం విడుదల చేసిన 2021–22 స్టాటిస్టికల్ నివేదిక ప్రకారం జిల్లాలో 4,21,118 ఎకరాలకు వరి సాగు చేరింది. ఆరేళ్ల క్రితం లక్ష మెట్రిక్ టన్నులకు మించని ధాన్యం దిగుబడి.. కొన్నేళ్లుగా ప్రతి సీజన్‌లో ఆరు లక్ష మెట్రిక్ టన్నులకు పైనే వస్తుంది. సాగు నీటి వనరులు సమృద్ధిగా ఉండడం 24 గంటల ఉచిత విద్యుత్, స్థానికంగా ధాన్యం కొనుగోళ్లతో రైతులంతా వరి వైపు మొగ్గు చూపుతున్నారు.

సమృద్ధిగా సాగునీరు

వృథాగా పోతున్న మూసీ జలాలకు అడ్డుకట్ట వేసి సద్వినియోగం చేసుకోవాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ల క్రితం బునాదిగాని, పిల్లాయపల్లి కాల్వలను ఆధునీకరించింది. తద్వారా మూసీ ఆధారిత కాల్వల కింద సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ఇక కాళేశ్వరం ప్రాజెక్టుద్వారా పొరుగున్న ఉన్న సిద్దిపేట జిల్లాలో రిజర్వాయర్లను నింపడంతో భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో యాదాద్రి జిల్లాలోని గుండాల, తుర్కపల్లి, బొమ్మలరామారం, రాజా పేట, ఆలేరు, మండలాల్లో వరికి అనుకూలంగా మారింది. దేవాదుల ప్రాజెక్టు ద్వారా గుండాల మండలంలోని చెరువులను నింపారు. అంతే కాకుండా వరుసగా నాలుగేళ్ల నుంచి సాధారణానికి మించి వర్షాలు కురుస్తుండడంతో చెరువులు, కుంటలన్నీ జలకళ సంతరించుకున్నాయి.వీటితో పాటు బిక్కేరు ఇతర వాగులపై నిర్మించిన చెక్‌డ్యాంలు భూగర్భ జలాలు పెరగడానికి దోహద పడుతున్నాయి.



నిండుకుండలా భువనగిరి చెరువు



ధాన్యం తూకం వేస్తున్న సిబ్బంది (ఫైల్)

వరి సాగు ఇలా	వానాకాలం		యాసంగి	
సంవత్సరం	ఎకరాలు	మెట్రిక్ టన్నులు	ఎకరాలు	మెట్రిక్ టన్నులు
2016-17	62,480	1,12,474	87,700	1,92,940
2017-18	1,26,224	1,95,456	1,18,237	3,58,075
2018-19	1,15,477	1,78,874	96,430	2,04,876
2019-20	1,34,491	2,38,872	1,98,710	4,76,706
2020- 21	2,02,348	4,45,156	2,40,030	4,80,060
2021-22	3,00,195	6,59,287	--	--

స్వగ్రామానికి వచ్చి సేద్యం

గుండాల మండలం రామారం గ్రామానికి చెందిన బెల్లంకొండ నాగరాజు బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్ వలస వెళ్లాడు. ప్రైవేట్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. నీటి సౌలభ్యత పెరగడంతో గ్రామానికి వచ్చి సేద్యం చేసుకుంటున్నాడు. తన సొంత భూమికి తోడు మరో నాలుగు ఎకరాలకు కౌలుకు తీసుకొని వరి సాగు చేస్తున్నాడు. నీటి వసతి ఉండ డం, స్థానికంగా ధాన్యం కొనుగోలు చేస్తుండడంతో గ్రామానికి వచ్చి సేద్యం చేసుకుంటున్నట్లు నాగరాజు చెబుతున్నాడు.


ఉపాధ్యాయ ఖాళీలు 1,374

- బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ వేగిరం
- వెబ్‌సైట్‌లో ఖాళీల వివరాలు, సీనియార్టీ జాబితా
- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

భువనగిరి : ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను జిల్లా విద్యాశాఖ వేగిరం చేసింది. బదిలీలతో పాటు మల్టీజోన్ పరిధిలోకి వచ్చే ప్రధానోపాధ్యాయుల ఖాళీల వివరాలపై స్పష్టత వచ్చింది. జిల్లాలో మొత్తం 1,374 ఖాళీలు ఉన్నట్లు అధికారులు తేల్చారు. ఇందులో ప్రధానోపాధ్యాయులకు సంబంధించి 113 ఖాళీలు ఉన్నాయి. వీటిని స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతి కల్పించడం ద్వారా భర్తీ చేయనున్నారు. మల్టీజోన్–2 పరిధిలోని 14 జిల్లాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు వీటి కోసం పోటీ పడే అవకాశం ఉంది. అన్ని కేటగిరీల్లో ఖాళీలు, సీనియారిటీ జాబితాను అధికారులు వెబ్ సైట్‌లో అధికారికంగా పొందుపర్చారు. ఉపాధ్యాయులు ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం శనివారం నుంచి 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారులు జూమ్ ద్వారా హెచ్‌ఎంలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, ఎంఈఓలతో బదిలీలు, పదోన్నతులపై సమావేశం ఏర్పాటు చేశారు.

ఖాళీల వివరాలు ఇలా..

జిల్లాలో అన్ని కేటగిరీల్లో 1,374 ఖాళీలు ఉన్నాయి. ఇందులో జీహెచ్‌ఎం 113, స్కూల్ అసిస్టెంట్లు 583, సెకండరీ గ్రేడ్ టీచర్లు 678 ఉన్నాయి. ఇందులో ఒకే పాఠశాలలో ఐదేళ్ల సర్వీసు ఉన్న వారు 21మంది, ఎనిమిదేళ్ల సర్వీసు ఉన్న ఉపాధ్యాయులు 746 మంది ఉన్నారు. పదవీ విరమణ 3 సంవత్సరాల లోపు ఉన్న వారు 87 మంది ఉన్నారు. ఈ ఖాళీలు, సీనియారిటీ జాబితా వివరాలను వెబ్‌సైట్ deoydd.blogspot.comలో పొందుపర్చారు. మొ త్తం మీద జిల్లాలో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తయిన అనతరం కూడా సుమారు 300 వరకు ఖాళీలు ఉండనున్నాయి. వీటిని టీఆర్‌టీ ద్వారా భర్తీ చేసే అశకాశం ఉంటుంది.



ఈ మండలాలకు అధిక ప్రాధాన్యం

హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న బీబీనగర్, బొమ్మలరామారం, భూదాన్‌పోచంపల్లి, భువనగిరి, చౌటుప్పల్ మండలాలు ఉన్నాయి. బదిలీలు, పదోన్నతులపై వెళ్లేందుకు ఆయా మండలాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. స్పౌజ్ టీచర్ల కూడా ఈ మండలాలకే ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

పారదర్శకంగా ప్రక్రియ

“ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పారదర్శకంగా చేపడుతాం. నేటి నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పటికే ఖాళీలు, సీనియార్టీ జాబితాను వెబ్ సైట్‌లో పొందుపర్చాం. బదిలీ దరఖాస్తులో వివరాలు సరిగా నమోదు చేయకపోతే శాఖాపరమైన చర్యలు ఉంటాయి.

–నారాయణరెడ్డి, డీఈఓ

ముస్తాబవుతున్న పాతగుట్ట

- 31 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు
- ఏర్పాట్లు చేస్తున్న ఆలయ అధికారులు

యాదగిరిగుట్ట : యాదాద్రి పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. ఈ నెల 31నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కల్యాణ మండపానికి రంగులు వేశారు. విమాన రథాన్ని సిద్ధం చేశారు, హోమాది పూజల నిర్వహణకు హోమ గుండాలు ఏర్పాటు చేశారు.

యాదాద్రిలో వైభవంగా తిరువీధి సేవ

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం నిత్య కంకర్యాలు కొనసాగాయి. ఇందులో భాగంగా సాయంత్రం ఆండాల్ అమ్మవారి తిరువీధి సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని అలంకరించి, ఆలయ మాఢ, తిరువీధుల్లో సేవోత్సవం చేపట్టారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారికి ఊంజలి సేవ జరిపించారు.



కల్యాణ మండపానికి రంగులు వేసిన దృశ్యం

డీసీపీగా రాజేశ్‌చంద్ర బాధ్యతల స్వీకరణ

సాక్షి, యాదాద్రి : యాదాద్రి భువనగిరి జోన్ నూతన డీసీపీగా ఎం.రాజేశ్‌చంద్ర శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ సెంట్రల్ జోన్ డీసీపీగా ఉన్న రాజేశ్‌చంద్రను ప్రభుత్వం రెండు రోజుల క్రితం ఇక్కడికి బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఇక్కడ పనిచేసిన డీసీపీ నారాయణరెడ్డి శంషాబాద్‌కు బదిలీ కాగా రాత్రి విధులనుంచి రిలీవ్ అయ్యారు. రాజేశ్‌చంద్రకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం బాధ్యతలు అప్పగించారు. ఇరువురు పరస్పరం అభినందనలు తెలుపుకున్నారు.



నూతన డీసీపీ రాజేశ్‌చంద్రకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న నారాయణరెడ్డి

న్యూస్‌రీల్

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

రామన్నపేట : ఆలేరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న చరిత్ర అధ్యాపక పోస్టును అతిథి లెక్చరర్‌తో భర్తీ చేయనున్నట్లు రామన్నపేట ప్రభుత్వ (ఐడీ) డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బెల్లి యాదయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో 55 శాతం కలిగిన జనరల్ అభ్యర్థులు, 50శాతం మార్కులు గల ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 2వ తేదీన రామన్నపేట డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. అదనపు అర్హతలు, బోధన అనుభవం గలవారికి ఎంపికలో ప్రాధాన్యత ఉంటుందన్నారు.

నృసింహుడి సేవలో డీసీపీ



డీసీపీ దంపతులకు లడ్డూ అందజేస్తున్న అధికారి

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని డీసీపీ నారాయణరెడ్డి దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వయంభూలకు ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం ముఖ మండపంలో ఉత్సవమూర్తుల వద్ద సువర్ణ పుష్పార్చన, అష్టోత్తర పూజల్లో పాల్గొన్నారు. డీసీపీ నారాయణరెడ్డి దంపతులకు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.


గిట్టుబాటు ధరకోసం ప్రత్యేక చట్టం తేవాలి



ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

భువనగిరి : పంటలకు గిట్టుబాట ధర కోసం గ్యారంటీ చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలభారత రైతు జిల్లా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు మాట్లాడుతూ.. విద్యుత్ సవరణ బిల్లు ఉపసంహరించుకోవాలని, అన్ని రకాల రుణాలను ఒకేసారి మాఫీ చేయాలన్నారు. చిన్న, సన్నకారు రైతులకు వడ్డీలేని రుణాలు ఇవ్వడంతో పాటు ఢిల్లీలో రైతు ఉద్యమం ఉపసంహరణ సందర్భంగా కేంద్రం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బునాదిగాని కాల్వ పనులు త్వరగా పూర్తి చేయాలని గంధమల్ల రిజర్వాయర్ పనులు ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షుడు పైళ్ల యాదిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కోల్లూరి రాజయ్య, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఏశాల అశోక్, ప్రజానాట్య మండలి నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగులపై వివక్ష తగదు



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ఆలేరురూరల్ : గ్రాట్యుటీ అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ ఆలేరులో శుక్రవారం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ధర్నా చేపట్టారు. వారికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి మాట్లాడుతూ.. పెంచిన వేతనాలను అమలు చేయాలని, ఏరియర్స్, 2017 నుంచి టీఏ, డీఏలు చెల్లించాలని కోరారు. అంతేకాకుండా కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు బూరుగు స్వప్న, సీఐటీయూ పట్టణ కన్వీనర్ రమేష్, నాయకులు రమ, లక్ష్మి, అనురాధ, శ్యామల, శోభ, బాలమణి పాల్గొన్నారు

సినీ నటి జమునకు జిల్లాతో అనుబంధం

యాదగిరిగుట్ట : ప్రముఖ సినీ నటి జమునకు జిల్లాతో అనుబంధం ఉంది. యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రాన్ని 2014లో సందర్శించి పూజలు చేశారు. అంతకుముందు సైతం జమున పలుమార్లు స్వామిని దర్శించుకున్నట్లు స్థానికులు, ఆచార్యులు చెబుతున్నారు. ఆలయం అద్భుతంగా అభివృద్ధి చెందడంతో పాటు భక్తుల తాకిడి పెరుగుతుందని జమున అప్పట్లో చెప్పినట్లు స్థానికులు తెలిపారు. శుక్రవారం జమున మరణించడంతో అప్పటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు.

ఒడియా భాషలో మాట్లాడి.. ఉత్తేజ పరిచి



విద్యార్థితో బోర్డుపై రాయించి పరిశీలిస్తున్న కలెక్టర్

- పెద్దగూడెంలో ఒడిశా పిల్లల కోసం వర్క్‌సైట్ స్కూల్ ఏర్పాటు
- ప్రారంభించి విద్యాబోధన చేసిన కలెక్టర్

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని పెద్దగూడెం పరిధిలో గల ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న ఒడిశా కార్మికుల పిల్లల కోసం ఏర్పాటు చేసిన వర్క్ సైట్ స్కూల్‌ను శుక్రవారం కలెక్టర్ పమేలా సత్పతి ప్రారంభించారు. చిన్నారులకు నోట్ పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. మాతృభాష ఒడియాలో మాట్లాడి చిన్నారులను ఉత్తేజపరిచారు. ఏ ప్రాంతం నుంచి వచ్చారంటూ పరిచయం చేసుకున్నారు. వారితో ఒడిశా పాటలు పాడించారు. అనంతరం విద్యార్థులకు విద్యాబోధన చేశారు. చిన్నారులచే బోర్డుపై రాయించి రాతను పరీక్షించారు.

పిల్లలఉన్నతులుగా తీర్చిదిద్దాలి

ఒడిశా కార్మికుల పిల్లలను విద్యాబుద్ధులు నేర్పి ఉన్నతులుగా తీర్చిదిద్దాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఆధార్ నంబర్ల ఆధారంగా పిల్లల పేర్లు నమోదు చేయాలని, తద్వారా వారి సొంతూళ్లకు వెళ్లిన తర్వాత తిరిగి చదువుకునే అవకాశం ఉంటుందన్నారు. తరచుగా వైద్యపరీక్షలు నిర్వహించాలని, అవసరమైన వారికి ఆల్బెడజోల్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి కృష్ణవేణి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సైదులు, సీడబ్ల్యూసీ చైర్మన్ బండారు జయశ్రీ, తహసీల్దార్ వీరాబాయి, ఎంపీడీఓ బాల శంకర్, ఆర్‌ఐ వెంకట్‌రెడ్డి, సర్పంచ్ మన్నె పద్మారెడ్డి, స్మైల్ టీం ఎస్ఐ ప్రభాకర్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సయ్యద్ మోహిసోద్దీన్, ఎన్‌సీపీ డైరెక్టర్ కుమారస్వామి, షీటీం హెడ్‌కానిస్టేబుల్ రవీందర్ రెడ్డి, సీడబ్ల్యూసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం పరిశీలన

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని జగత్‌పల్లిలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. పరీక్షల తీరూతెన్నులను పరిశీలించారు. పరీక్షలు చేయించుకున్నవారి వివరాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నోముల ఎల్లారెడ్డి, తహసీల్దార్ వీరాబాయి, ఎండీపీఓ బాలశంకర్, ఎంఈఓ యాదగిరి, ఆర్‌ఐ వెంకట్‌రెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అనంతారంలో ‘శుక్రవారం సభ’

భువనగిరి : తల్లీబిడ్డల సంరక్షణ కోసం అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం సభలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. భువనగిరి మండలం అనంతారంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన శుక్రవారం సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి గర్భిణి అంగన్‌వాడీ, ఆశకార్యకర్తల వద్ద తన వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఆరు నెలల వరకు ఐరన్, క్యాల్షియం మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలలని, తేలికపాటి వ్యాయామాలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ కృష్ణవేణి, యూనిసెఫ్ రాష్ట్ర బృందం సభ్యులు శివాల్కర్‌రెడ్డి, నర్సింహారావు, సుబ్బారెడ్డి, ఎంపీపీ నరాల నిర్మల, ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, సర్పంచ్ మల్లికార్జున్, మెడికల్ ఆఫీసర్ యామిని, ఉప సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



నేటి నుంచి చెర్వుగట్టు జాతర

నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టులో వెలిసిన శ్రీపార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. -వివరాలు 8లో

ప్రాణాలైనా ఇస్తాం.. భూములివ్వం

- రీజినల్ రింగ్ రోడ్డు బాధితుల ధర్నా



మోకాళ్లపై నిలబడి ప్లకార్డులు ప్రదర్శిస్తూ ధర్నా చేస్తున్న రైతులు

భువనగిరి : రాజకీయ నాయకుల భూములను కాపాడేందుకు అలైన్‌మెంట్ మార్చారు.. ప్రాణాలైనా ఇస్తాం కానీ భూములు మాత్రం ఇచ్చేది లేదని భువనగిరి మండలంలోని రాయగిరి రీజినల్ రింగ్ రోడ్డు బాధితులు స్పష్టం చేశారు. రాయగిరి సమీపం నుంచి వెళ్లనున్న రీజనల్ రింగ్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులను నేషనల్ హైవే అధికారులు, రెవెన్యూ అధికారులు శుక్రవారం ఆర్డీఓ కార్యాలయానికి అభిప్రాయ సేకరణ కోసం రావాలని సూచించారు. ఈ మేరకు బాధితులు ఉదయం 11 గంటలకు కార్యాలయానికి వచ్చారు. అధికారులు సమయానికి రాకపోవడంతో గంటపాటు ఎదురు చూసి ధర్నాకు దిగారు. మోకాళ్లపై నిలబడి, ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ నెల 19న నిర్వహించిన అభిప్రాయ సేకరణలో తమ అభ్యంతరాలకు అధికారులు సరైన సమాధానాలు ఇవ్వలేదన్నారు. తిరిగి ఈనెల 27వ తేదీన మరోసారి అభిప్రాయ సేకరణకు పిలిచారని, తమ అభ్యంతరాలపై లిఖిత పూర్వకంగా సమాధానం ఇస్తామని అధికారులు చెప్పినట్లు పేర్కొన్నారు. కానీ, సమయానికి రాకపోవడంపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల తీరుతో తాము ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. మూడుసార్లు అలైన్‌మెంట్ మార్చడం వెనుక మతలబు ఏమిటని ప్రశ్నించారు. వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న తాము భూములు ఇవ్వబోమన్నారు. ఈ కార్యక్రమంలో తంగళ్లపల్లి రవికుమార్, రైతులు పాల్గొన్నారు.

జాన్‌పహాడ్ జనసంద్రం



దర్గా వద్ద కిక్కిరిసిన భక్తులు

- వైభవంగా జాన్‌పహాడ్ దర్గా గంధోత్సవం
- సైదన్న నామస్మరణతో మార్మోగిన దర్గా పరిసరాలు
- పూజల్లో పాల్గొన్న ప్రముఖులు
- లక్షకుపైగా తరలివచ్చిన భక్తులు

పాలకవీడు : జాన్‌పహాడ్ సైదన్న ఉర్సుకు రెండో రోజు శుక్రవారం భక్తజనం పోటెత్తారు. ఉత్సవాల్లో భాగంగా వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి తీసుకువచ్చిన పవిత్ర గంధానికి చందల్‌ఖానాలో ప్రముఖుల సమక్షంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎంపీ బడుగుల లింగయ్య, ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, వక్ఫ్‌బోర్డు పెద్దలు గంధం కలశాన్ని ఎత్తుకుని ఊరేగింపును ప్రారంభించారు. కుటుంబ సమేతంగా కలెక్టర్ హేమంత్‌కేశవ్ పాటిల్ దర్గాను సందర్శించారు. ప్రత్యేకంగా అలంకరించిన అశ్వంపై పవిత్ర గంధాన్ని గ్రామ పురవీధుల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రత్యేక పోలీసు బలగాలతో ఊరేగింపు నిర్వహించిన అనంతరం దర్గాకు తీసుకుచ్చారు. గంధాన్ని దర్గాలోకి తీసుకొచ్చి సైదులు బాబా సమాధులపై పెట్టి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గాలోకి గంధాన్ని తీసుకొచ్చే సమయంలో భక్తులు అధిక సంఖ్యలో ఉండడంతో స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. రాష్ట్రం నలుమూలల నుంచి కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి బస్సులు, ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలపై లక్షకు పైగా భక్తులు దర్గాను సందర్శించారు. నాగుల పుట్ట వద్ద మహిళలు పాలు, పండ్లు, గుడ్లు పెట్టి ప్రత్యేక పూజలు చేశారు.



నాగుల్‌మీరా పుట్టవద్ద పూజలు చేస్తున్న భక్తులు

క్లుప్తంగా

సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలి



సీడీపీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

భువనగిరి : సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలో రిటైర్ అయిన అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక సీడీపీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ఆ సంఘం జిల్లా కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్స్‌కు కేంద్రం పెంచిన వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు నెలల ఏరియర్స్‌తో పాటు 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న టీఏ, డీఏలను చెల్లించాలన్నారు. అనంతరం సీడీపీఓ స్వరాజ్యానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి చిలువేరు రమాకుమారి, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వెంకటేశం, నాయకులు ప్రమీల, షాహెద, రుక్మిణి, పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ): నల్లగొండ ఎన్జీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక (గెస్ట్ లెక్చరర్) పోస్టుల భర్తీకి అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ ఘనశ్యామ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జువాలజీ 1, కామర్స్ 2, మాథ్స్ 1 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 31వ తేదీ లోపు కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.



నేటి నుంచి చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలు



చెర్వుగట్టు పైకి వెళ్లే ప్రధాన ద్వారం



చెర్వుగట్టు దేవాలయం

రామలింగేశ్వరుడి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

- 29న స్వామివారి కల్యాణం
- ప్రముఖ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న చెర్వుగట్టు
- దక్షిణ తెలంగాణ జిల్లాల నుంచి తరలిరానున్న భక్తులు


నార్కట్‌పల్లి : ప్రసిద్ధ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న నార్కట్‌పల్లి మండలంలోని చెరువుగట్టు గ్రామంలో వెలిసిన శ్రీపార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవాలయ ఉత్సవాలకు వేళైంది. శనివారం నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. చెరువుగట్టు కొండపై వెలిసిన రామలింగ్వేరుడు భక్తజన బాంధవుడిగా వెలుగొందితున్నాడు. స్వామి వారు జడల ఆకృతిని పోలి ఉండటంతో జడల రామలింగేశ్వరుడిగా పిలువబడుతున్నారు.



శివుని విగ్రహం

బ్రహ్మోత్సవాల్లో జరిగే కార్యక్రమాలు

దేవాలయంలో ప్రధాన మండపంలో ప్రజాప్రతినిధుల గ్రామ పెద్దల సమక్షంలో అర్చకులు ప్రత్యేక పూజలతో బ్రహ్మోత్సవాలు ప్రారంభిస్తారు. 28న ఉత్సవాల ప్రారంభానికి విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య, జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి తదితరులు హాజరవుతారు. ప్రత్యేక పూజలతో బ్రహ్మత్సవాలను పండితులు అల్లవరపు సుబ్రహ్మణ్య దీక్షితావధాని, నీలకంఠశివాచార్య, దేవాలయ ప్రధాన అర్చకులు రామలింగేశ్వరశర్మ మరో 20 మంది అర్చక బృందం ప్రారంభిస్తారు. 29వ తేదీ తెల్లవారుజామున 4 గంటలకు కల్యాణ మండపంనందు స్వామివారి కల్యాణం జరుగుతుంది. అదే రోజు రాత్రి కోనెరులో తెప్పోత్సవం, 30వ తేదీ తెల్లవారుజామున 4గంటలకు అగ్నిగుండాలు, 31వ తేదీ తెల్లవారు జామున దోపోత్సవము, సాయంత్రం ఏకాంతసేవ, ఫిబ్రవరి 1న ఉదయం రుద్రాభిషేకం, ఏకాంతసేవ, 2న సాయంత్రం గజవాహనముపై స్వామి, అమ్మవార్ల, చెరువుగట్టు, ఎల్లారెడ్డిగూడెం గ్రామాల్లో ఊరేగింపు జరుగుతుంది. స్వామి వారి కల్యాణ్యాన్ని భక్తులందరూ తిలకించేందుకు ప్రత్యేకంగా 6 ప్రొజెక్టర్ స్క్రీన్లను కొండ పైన, కింద ఏర్పాటు చేస్తున్నారు. కొండపైన కింద ప్రత్యేకంగా ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. పారిశుద్ధ్యం మెరుగునకు తగిన సిబ్బందిని నియమించారు. డీఎల్‌పీఓ లక్ష్మీ నారయణ, ఎంపీడీఓ యాదగిరి పర్యవేక్షణ చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శికిరణ్‌కుమార్ తెలిపారు. గట్టుపైన, కింద విచారణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని పోలీసులు తెలిపారు,



మూడు గుండ్ల ప్రాంతం

ప్రత్యేక పార్కింగ్

నార్కట్‌పల్లి నుంచి వచ్చే వాహనాలకు చెర్వుగట్టు గ్రామ శివారులో, ఎల్లారెడ్డిగూడె నుంచి వచ్చేవారికి దారిలో, ఏపీ లింగోటం నుంచి వచ్చే వారికి గామ శివారులో ప్రత్యేకంగా పార్కింగ్ వసతి ఏర్పటు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేయు భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు నార్కట్‌పల్లి డిపో మేనేజర్ వెంకటమ్మ తెలిపారు. నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగుడ, దేవరకోండ డిపో నుంచి బస్సులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి 5నిమిషాలకు ఒక బస్సు చొప్పున నడుపుతున్నట్లు చెప్పారు. హైదరాబాద్, భువనగిరి నుంచి నల్లగొండకు వచ్చే ప్రతి ఆర్డీనరి సర్వీసు చెర్వుగట్టు మీదుగా వెళ్లనున్నట్లు తెలిపారు.

అమావాస్య ప్రత్యేకత

ప్రతి నెల అమావాస్యకు జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి దేవస్థానానికి లక్షల కొలది సంఖ్యలో భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకొని ఆ రాత్రి అక్కడే నిద్రచేస్తారు. మరుసటిరోజు స్వామిని దర్శించుకొని వెళ్లడం ఆచారంగా కొనసాగుతుంది.

ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు



ఉత్సవాలకు విచ్చేయు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం, భక్తులకు నీటి సౌకర్యం, మరుగుదొడ్లు, సౌకార్యలు కల్పించేందుకు 8 జోన్‌లు ఏర్పాటు చేశాం. జోన్‌కు జిల్లా స్థాయి అధికారిని ఇన్‌చార్జిగా నియమించాం. విద్యుత్ సమస్య పరిష్కారానికి గట్టు పై 100 కేవీ టాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయిస్తున్నాం.

– జయచంద్రారెడ్డి, ఆర్డీఓ

ఆరు రోజుల పాటు ఉత్సవాలు



శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఆరు రోజుల పాటు జరగనున్నాయి. ఉత్సావాలుకి ఆర్డీఓ జయచంద్రరెడ్డి , డీఎస్పీ నర్సింహారెడ్డి పర్యవేక్షణలో జరగనున్నాయి. బ్రహ్మత్సవాల గురించి ప్రజలకు తెలియ జేయడానికి గాను జిల్లాలోనే కాకుండా ఇతర జిల్లాల్లో కూడా ప్రచారం చేస్తున్నాం.

– సిరికొండ నవీన్‌కుమార్, ఈఓ

భక్తులకు ఇబ్బందులు కలగకుండా..



బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ముఖ్యంగా పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు సిబ్బందిని నియమించాం. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నీటి సౌకర్యం, మరుగు దొడ్ల ఏర్పాటు చేయించాం. భక్తులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెత్త కుండీలను వినియోగించుకుని సహకరించాలి.

– బాలకృష్ణ, చెర్వుగట్టు సర్పంచ్

కొత్త వంగడాల సాగుకు పంట మార్పిడి చేయాలి

మోతె: కొత్త వంగడాల సాగుకు పంట మార్పిడి చేయాలని కేవీకే శాస్త్రవేత్తలు డి.నరేష్, కిరణ్ రైతులకు సూచించారు. శుక్రవారం మోతె మండల పరిధిలో రావిపహాడ్ క్లస్టర్ రైతు వేదికలో జరిగిన శ్రీ అరవింద కృషి విజ్ఞాన కేంద్రం గడ్డిపెల్లి వారి ఆధ్వర్యంలో జాతీయ ఆహార భద్రత పథకం పప్పు దినుసుల పెసర పంటల సామూహిక ప్రదర్శన క్షేత్రంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవన ఎరువులు, సేంద్రియ ఎరువుల వాడకం మూలాన ఖర్చు తగ్గడంతో పాటు పంట దిగుబడి సాధించవచ్చన్నారు. ప్రతి రైతు జీవన,సేంద్రియ ఎరువులపై అవగాహన కలిగి ఉండాలన్నారు.అనంతరం రైతులకు జీవ ఎరువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి కార్తిక్, రైతులు మల్లారావు, మధుసూదన్‌రెడ్డి, హేమేందర్ పాల్గొన్నారు.



రైతులకు పెసర విత్తనాలు అందజేస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

వ్యవసాయ అనుబంధ రంగాలపై దృష్టి సారించాలి

త్రిపురారం : వ్యవసాయంలో ఒక్క పంటలపైనే కాకుండా వ్యవసాయ అనుబంధ రంగాలతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ హెడ్ నారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం త్రిపురారంలో నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వ్యవసాయ క్షేత్రంలో కేంద్ర ప్రభుత్వ పథకం నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా పెంచుతున్న కోళ్ల, గొర్రెల పెంపకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కోళ్ల, గొర్రెలకు అందించే దానా గడ్డి రకాలు ఆదాయంపై వివరాలు అడిగి తెలుసున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నరేందర్, బాబుసాయి పేట సర్పంచ్ శ్రవణ్ కుమార్, డైరెక్టర్ నాగరాజు, అనిల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి అధితరులు పాల్గొన్నారు.



షెడ్డులో పెంచుతున్న గొర్రెలను పరిశీలిస్తున్న నారాయణరెడ్డి తదితరులు

పుట్టగొడుగుల సాగుతో అధిక లాభాలు

నడిగూడెం : పుట్టగొడుగుల సాగుతో అధిక లాభాలు పొందవచ్చని ఆదర్శ రైతు దంపతులు వాసికర్ల శేషు కుమార్, లక్ష్మీప్రియ తెలిపారు. శుక్రవారం మండలంలోని సిరిపురం గ్రామంలో సమీకృత వ్యవసాయ చేస్తున్న వాసికర్ల శేషుకుమార్ వ్యవసాయ క్షేత్రాన్ని నాబార్డు సహకారంతో నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామానికి చెందిన రైతు ఉత్పత్తిదారుల సంఘం నుంచి మహిళా రైతులు క్షేత్ర సందర్శన చేశారు. ఈ సందర్భంగా పుట్టగొడుగుల సాగుపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆ దంపతులు మాట్లాడారు. తక్కువ భూమిలో అధిక పంటలు సాగు చేయవచ్చని, అలాగే నిత్యం ఆదాయం ఉండాలంటే సమీకృత వ్యవసాయం చేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా పుట్టగొడుగుల పెంపకం, మార్కెటింగ్, పలు సేంద్రియ పద్ధతులు, ద్రావణాల తయారీ, పశుగ్రాసాల సాగుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 40 మంది మహిళా రైతులు పాల్గొన్నారు.

మోటార్ సైకిళ్లను సబ్సిడీపై ఇవ్వాలి

భువనగిరి : భవన నిర్మాణ కార్మికులకు మోటార్ సైకిళ్లను సబ్సిడీపై ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీసీడబ్ల్యూ, సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు రాములు, కోమటిరెడ్డి చంద్రారెడ్డి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న రూ. 54 వేల క్లెయిమ్స్‌కు వెంటనే నిధులు విడుదల చేయాలన్నారు. లేబర్ ఆఫీస్‌లో ఖాళీలను భర్తీచేసి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారికి రూ. 10 లక్షలు, సహజ మరణానికి రూ. 5 లక్షలు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశం, నర్సింహ్మా, శ్రీనివాస్, రామచంద్రం, మైసయ్య, అమరేందర్, మారయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి వైద్య కళాశాల ఎదుట ఆందోళన

నార్కట్‌పల్లి : వైద్య కళాశాల యాజమాన్యం తమ పిల్లల జీవితాలతో చెలగాటం అడుతోందని ఆరోపిస్తూ శుక్రవారం నార్కట్‌పల్లి వైద్య కళాశాల ఎదుట విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ నార్కట్‌పల్లి వైద్య కళాశాలలో చదువుతున్న నాల్గో సంవత్సరం విద్యార్థులకు ఫిబ్రవరి 21వ తేదీ నుంచి పరీక్షలు ఉన్నాయని, అర్ధరాత్రి సమయంలో పరీక్ష ఫీజుల లింకును కల్పించడం విడ్డురంగా ఉందన్నారు. పరీక్ష ఫీజులను కట్టేందుకు అనుమతించకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ప్రిన్సిపాల్ మాట్లాడేందుకు ఎందుకు ముఖం చాటేస్తున్నారని ప్రశ్నించారు. విద్యార్థులకు అటెండెన్స్ ఉన్నప్పటికీ కళాశాల యాజమాన్యం పరీక్షలు రాసేందుకు ఎందుకు అనుమతించడం లేదని అన్నారు. 150 మంది విద్యార్థులకు పరీక్షలకు అనుమతించకపోవడం దారుణమన్నారు.

జంతు హింసను నివారించాలి

నల్లగొండ అగ్రికల్చర్ : జంతు హింసను నివారించడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అంబటి యాదగిరి పిలుపునిచ్చారు. జంతు హింస నివారణ పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రభుత్వ బాలుర హైస్కూల్ విద్యార్థులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆర్పీ రోడ్డు, గడియారం సెంటర్, ప్రకాశం బజార్ మీదుగా ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ వన్యప్రాణులను రక్షించుకోవాలని, పర్యావరణాన్ని పరిరక్షించాలని అన్నారు.

అధునాతన పద్ధతిలో మెట్ట వరిసాగు

మిర్యాలగూడ: డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అధునాతన పద్ధతిలో మెట్ట వరి సాగును మాడ్గులపల్లి మండలంలోని ఇందుగుల గ్రామంలోని కట్టా దామోదర్‌రెడ్డి పొలంలో శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ వీరస్వామి మాట్లాడుతూ యూరియా, పొటాష్, అడుగుపిండి కలిపి తయారు చేసిన గుళికలను మెట్టసాగు పద్ధతిలో సుమారు 8 నుంచి 10 అంగుళాల భూమిలో వేయడంతోపాటు పై భాగంలో మూడు అంగుళాల్లో విత్తనాలు వేశారు. దీంతో భూమిలో పెట్టిన గుళికలు ద్వారా మొక్కకు సరిపడ పోషకాలు అంది మంచి దిగుబడులు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఫెసిలిటర్ సబ్బుసింగ్, రమేష్, రైతులు జెర్రిపోతుల వెంకన్న, చింతపల్లి సీతారాములు, కొడదల సైదులు, ఇండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మెట్ట వరి సాగుపై అవగాహన కార్యక్రమానికి హాజరైన రైతులు

పరీక్షలు పండుగ వాతావరణంలో రాయాలి



విద్యార్థులతో పీవీ శ్యాంసుందర్‌రావు

భువనగిరి : విద్యార్థులు పరీక్షలను భయంతో కాకుండా పండుగ వాతావరణంలో రాయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు అన్నారు. ఇటీవల నిర్వహించిన పరీక్ష పే చర్చా కార్యక్రమంలో భాగంగా చిత్రలేఖనంలో గెలుపొందిన విద్యార్థులకు శుక్రవారం స్థానిక జీనియస్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రదాని నరేంద్ర మోదీ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పరీక్ష పే చర్చ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పరీక్షలు అంటే ఒత్తిడి, భయానికి లోనుకాకుండా ఉండే విధంగా కార్యక్రమం దోహదపడుతుందన్నారు. పర్వతారోహికురాలు అన్వితారెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో మాసన్న, పాశం భాస్కర్,రవీందర్, శ్రీనివాస్, నర్ల నర్సింగ్‌రావు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అభివృద్ధికి ఆయిల్ పాం సాగు దోహదం

ఆత్మకూరు(ఎం): రైతుల ఆర్థిక అభివృద్ధికి ఆయిల్ పాం సాగు దోహదం చేస్తుందని రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కొరటికల్‌లో రైతు దూసరి రాజు వ్యవసాయ భూమిలో ఆయిల్ పాం మొక్కలు నాటిన అనంతరం మాట్లాడారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఆయిల్ పాం సాగు చేయడానికి రైతులు ముందుకు వస్తున్నారని చెప్పారు. జిల్లాలో నాలుగు వేల ఎకరాలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు ఒక వెయ్యి ఎకరాల్లో సాగు చేసినట్లు తెలిపారు. దేశంలో వంట నూనెల కొరత అధిగమించడానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని, అందులో భాగంగా బడ్జెట్‌లో రూ. వెయ్యి కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 20లక్షల ఎకారాల్లో సాగు చేయాలన్నదే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 27 జిల్లాల్లో 1.20లక్షల ఎకరాల్లో ప్రస్తుతం ఆయిల్ పాం సాగు చేస్తున్నామని తెలిపారు. పత్తికి, వరికి ప్రత్యామ్నాయ పంటగా ఆయిల్ పాం సాగుకు రైతులు ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కోల సత్తయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బీసు చందర్ గౌడ్, ఆత్మ రాష్ట్ర డైరెక్టర్ సోలిపురం అరుణాఉపేందర్‌రెడ్డి, డీసీఓ ప్రవీణ్, ఏఈఓ వి.కీర్తన, పీల్డ్ ఆఫీసర్ జోత్స్న తదితరులు పాల్గొన్నారు.



మొక్కనాటుతున్న రామకృష్ణారెడ్డి

క్రీడాకారులకు మేధాశక్తి అధికం

యాదగిరిగుట్ట రూరల్: క్రీడాకారులకు మేధాశక్తి అధికంగా ఉంటుందని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అన్నారు. మండలంలోని వంగపల్లి గ్రామంలో కేసరి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ పోటీలను డీసీసీబీ చైర్మన్, టెస్కాబ్ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డితో కలిసి శుక్రవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు చదువులతో పాటు ఆటలు చాలా ముఖ్యమని అన్నారు. అనంతరం కబడ్డీ ఆటలను ప్రభుత్వ విప్ ఆడి జిల్లాలోని కూనూర్, వంగపల్లి జట్ల మధ్య ఆటలను టాస్ వేసి ప్రారంభించారు. కాగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి కబడ్డీ ఆటను ఆడడానికి 20 జట్లు, బాల్ బ్యాడ్మింటన్ ఆటలు ఆడడానికి 20 జట్లు వచ్చాయని కేసరి యూత్ అధ్యక్షులు రేగు బాల్‌నర్సయ్య తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తోటకూరి అనురాధ, సర్పంచ్ కానుగు కవిత బాలరాజ్ గౌడ్, ఉపసర్పంచ్ రేపాక స్వామి, కేసరి యూత్ అధ్యక్షుడు రేగు బాలనర్సయ్య, జిల్లా కబడ్డీ ట్రెజరర్ కుమార్, యాత్ర స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ సురుపంగ శివలింగం, ప్రధానోపాధ్యాయులు రవికుమార్, ఎస్ఎమ్‌సీ చైర్మన్ అంజనేయులు, మదర్ డైరీ చైర్మన్ కళ్లెపల్లి శ్రీశైలం మహేంద్ర యువసేన అధ్యక్షులు ఎండీ అజ్జు పాల్గొన్నారు.



కబడ్డీ ఆడుతున్న ప్రభుత్వ విప్

● వైభవంగా జాన్‌పహాడ్ దర్గా గంధోత్సవం



పాటలు పాడుతున్న ఖవ్వాలీ బృందం



ఆరుబయట భోజనాలు చేస్తున్న భక్తులు



జాన్‌పహాడ్ దర్గాలో కలెక్టర్, ఎస్పీ రాజేంద్రప్రసాద్ ప్రార్థనలు



దర్గా వద్ద కిక్కిరిసిన భక్తులు



దర్గాలో భక్తుల కోలాహలం





మొక్కు చెల్లించేందుకు వస్తున్న భక్తురాలు, పార్కింగ్ స్థలంలో నిలిచిన వాహనాలు



కృష్ణానది వద్ద పర్యాటకుల సందడి



మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు